క్లుప్తంగా

ఎంప్లాయ్‌మెంట్ రిజిస్ట్రేషన్ రెన్యువల్‌కు అవకాశం

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలోని ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్‌లో గడువు తీరిపోయిన రిజిస్ట్రేషన్లను రెన్యువల్ చేస్తున్నట్లు కార్మికశాఖ కార్యదర్శి, ఎంప్లాయ్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎ.ముత్తమ్మ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2015 జూన్ 1 నుంచి 2018 సెప్టెంబర్ 30 వరకు ఉన్న రెన్యువల్ కాని రిజిస్ట్రేషన్ కార్డులకు మాత్రమే ఈ అవకాశముందన్నారు. అర్హులైన, ఆసక్తి గల నిరుద్యోగ అభ్యర్థులు ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్‌లో ప్రత్యేక దరఖాస్తును సమర్పించాలన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం

అల్లవరం: బోడసకుర్రు అయినాలవారి వీధిలో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయి నిరాశ్రయులైన బాధిత కుటుంబాలకు తక్షణ సాయంగా 20 కేజీల బియ్యాన్ని సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి శనివారం అందించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ అడపా వెంకటేశ్వరరావు, వీఆర్వోలు ఉల్లీస్, గెద్దాడ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందనలు



శశికళకు షూట్, షూస్ కిట్లను అందిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు శ్రీహరిరామ్ గోపాల్

అమలాపురం రూరల్: రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైన ఇందుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని శశికళను జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరిరామ్ గోపాల్ శనివారం పాఠశాలలో అభినందించారు. విద్యార్థినికి పవర్ లిఫ్టింగ్ సంబంధించిన షూట్, షూస్ కిట్లను బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వి.శ్రీనివాసరావు, పీఈటీ నరసింహారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

4న చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం

అమలాపురం టౌన్: అమలాపురం ది అసోసియేషన్ చాంబర్ ఆఫ్ కామర్స్‌కు ఇటీవల ఎన్నికైన నూతన కార్యవర్గం ఈ నెల 4వ తేదీ సాయంత్రం 4 గంటలకు స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో ప్రమాణం స్వీకారం చేయనుంది. ఈ మేరకు చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రమాణ స్వీకారానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను స్థానిక కల్వకొలనువీధిలో చాంబర్ ప్రతినిధులు శనివారం విడుదల చేశారు.

జల్‌జీవన్ మిషన్‌పై అవగాహన

ఉప్పలగుప్తం: మండలంలోని విలసవిల్లి గ్రామంలో సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి ఆధ్వర్యంలో జల్‌జీవన్ మిషన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి 55 లీటర్ల చొప్పున తాగునీరు అందిస్తున్నామని నీటిని పొదుపుగా వాడుకోవాలని సర్పంచ్ సూచించారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కేఎస్ గౌరీకుమారి, పంచాయితీ కార్యదర్శి దాసరి కృష్ణాజీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కె.సురేష్, సలాది సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రహదారులకు భూమి పూజ

అమలాపురం రూరల్: కామనగరువు పంచాయతీ పరిధిలో బీవీఆర్, వీఎస్ఆర్, బాలయోగి కాలనీల్లో సుమారు రూ.20 లక్షల పంచాయతీ నిధులతో నిర్మించే సీసీ రోడ్లకు సర్పంచ్ నక్కా అరుణకుమారి శనివారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఆర్.భాస్కరరావు, ఎంపీటీసీ మెండు గంగాభవానీ, వైఎస్సార్ సీపీ నాయకులు నక్కా చంద్రశేఖర్, వార్డు సభ్యులు జొన్నాడ పల్లాలమ్మ, గుత్తుల నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్ పోస్టర్ల విడుదల

అమలాపురం టౌన్: ఏబీవీపీ, త్వరలో నిర్వహించనున్న ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్ పోస్టర్లను స్థానిక విద్యానిధి కళాశాలలో శనివారం విడుదల చేశారు. విద్యానిధి విద్యా సంస్థల చైర్మన్ ఏబీ నాయుడు, ఏబీవీపీ పాలిటెక్నిక్ ఉచిత కోచింగ్ సెంటర్ కన్వీనర్ అశోక్ తదితరులు పోస్టర్లను విడుదల చేసి కోచింగ్ విధివిధానాలను వెల్లడించారు. పాలిటెక్నిక్‌కు సన్నద్ధమవుతున్న ప్రతి విద్యార్థి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏబీవీపీ కళాశాలల విద్యార్థులు, విద్యానిధి కళాశాల ప్రిన్సిపాల్ సుధీర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రా బ్యాంకు మాజీ డైరెక్టర్‌కు మాతృ వియోగం

అల్లవరం: ఆంధ్రా బ్యాంకు మాజీ డైరెక్టర్ పరసా పరమేశ్వరరావు తల్లి చిట్టికాసులు(97) కొమరగిరిపట్నంలోని వారి స్వగృహంలో శనివారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆమెకు ఐదుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. చిట్టికాసులు మృతిపై ఆల్డా చైర్మన్ యాళ్ల దొరబాబు, చాంబర్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ, మేడిద రమేష్ తదితరులు సంతాపం తెలిపారు.

ఆత్మవిశ్వాసమే.. కావాలి అస్త్రం

- రేపటి నుంచి పదో తరగతి పరీక్షలు
- చదువుపై దృష్టి పెడితే మంచి భవిష్యత్



పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు

ముమ్మిడివరం/ఐ.పోలవరం: ప్రతి విద్యార్థి జీవితంలో పదో తరగతి పరీక్షలన్నవి ఓ మైలు రాయిలాంటివి. ఈ పరీక్షల్లో వచ్చిన మార్కులు భవిష్యత్‌ను నిర్ణయిస్తాయి. భవిష్యత్‌లో ఇంజినీరింగ్, మెడిసిన్, సీఏ, లా.. ఎటు వైపుగా అడుగులేయాలో సైతం ఈ ఫలితాల్నే ప్రాతిపదికగా తీసుకుంటుంటారు.

అంతటి కీలకమైన పదో తరగతి పరీక్షలు ఏప్రిల్ 3వ తేదీ సోమవారం నుంచి ప్రారంభం కాబోతున్నాయి. విద్యార్థులందరికీ మరో 17 రోజుల పాటు ఎంతో కీలకం. అల్లరి, సరదాలకు కాస్త విరామమిచ్చి ఈ కొద్దిరోజులు చదువుపై దృష్టిపెడితే భవిష్యత్ బంగారుమయమవుతుంది. ఏ సబ్జెక్టు అయినా భయం లేకుండా ఆత్మవిశ్వాసంతో చదివితే మంచి మార్కులొస్తాయని ఉపాధ్యాయులు చెబుతున్నారు. పరీక్షలు రేపటి నుంచే ప్రారంభం కాబోతున్న నేపథ్యంలో వివిధ సబ్జెక్టుల్లో ఏయే అంశాలపై దృష్టి సారించాలో వివరిస్తున్నారు.

అక్షర దోషాలు లేకుండా చూసుకోవాలి



తెలుగే కదా అని చులకనగా చూస్తే మార్కులు తగ్గిపోతాయి. తెలుగులో ఎక్కువ మార్కులు రావాలంటే అక్షర దోషాలు లేకుండా చూసుకోవాలి. కవి పరిచయాలు, నేపథ్యాలతో పాటు పద్యాలకు భావాలు చదువుకుంటే మంచిది.

– పచ్చిమాల శివనాగరాజు, తెలుగు పండిట్, ముమ్మిడివరం

సైన్స్ రెండు గంటలు చదవాలి



ఇతర సబ్జెక్టుల కంటే సైన్స్ సబ్జెక్టుపై విద్యార్థులు ఎక్కువ శ్రద్ధ పెట్టాల్సిన అవసరముంది. రోజుకు రెండు గంటల పాటు చదివితే చాలు. బిట్లు, డయాగ్రామ్స్ సాధన చేయాలి. పాత ప్రశ్నాపత్రాల్లోని ప్రశ్నలు చదివి రివిజన్ చేసుకోవాలి.

– యు.వెంకటరావు, ఫిజిక్స్ టీచర్, మురమళ్ల

లెక్కల్లో వందకు వంద



లెక్కలకు మించిన సులభమైన సబ్జెక్టు మరొకటి ఉండదు. వందకు వంద మార్కులు తెచ్చుకోవచ్చు. లెక్కల్లో సూత్రాలు ప్రధానం కాబట్టి వాటిపై దృష్టిపెట్టాలి. అలాగే సిద్ధాంతాలు ఎక్కువగా సాధన చేయాలి.

– అప్పన వెంకటేశ్వరరావు, మాథ్స్ టీచర్, మురమళ్ల

మ్యాప్ పాయింటింగ్ ప్రధానం



సోషల్‌లో ఎక్కువ మార్కులు రావాలంటే మ్యాప్ పాయింటింగ్, బిట్ పేపరుపై దృష్టి పెట్టాలి. పాత ప్రశ్నా పత్రాలను సేకరించుకుని వాటిలో ఎక్కువ సార్లు వచ్చిన వాటిని గుర్తించి ఆ ప్రశ్నలను చదువుకుంటే మంచి మార్కులు సాధించే వీలుంటుంది.

– వాడ్రేవు భైరవస్వామి, సోషల్ టీచర్, ఐ.పోలవరం

మహిళాభ్యున్నతికి ముఖ్యమంత్రి జగన్ కృషి



మహిళా సంఘాల ప్రతినిధులకు చెక్కును అందజేస్తున్న జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- కలెక్టర్‌తో కలసి వైఎస్సార్ ఆసరా మూడో విడత రుణమాఫీ చెక్కు అందజేత

తాళ్లరేవు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల ఆర్థికాభివృద్ధికి, మహిళాభ్యున్నతికి కృషి చేస్తున్నారని ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. శనివారం కోరంగి ఫారెస్ట్ కాంప్లెక్స్ సమీపంలోని లేఅవుట్‌లో ఏర్పాటుచేసిన మూడో విడత ఆసరా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండలంలోని 1485 గ్రూపులకు రూ.11.24 కోట్ల చెక్కును జిల్లా కలెక్టర్ కృతికా శుక్లాతో కలిసి మహిళా సంఘాల ప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ మాట్లాడుతూ పుట్టే బిడ్డ దగ్గర నుంచి పండు ముదుసలి వరకూ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమని కొనియాడారు. చిన్నారులకు అమ్మ ఒడి, జగనన్న విద్యా కానుకల దగ్గర నుంచి అవ్వాతాతల పింఛన్ల వరకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఆయా పథకాలన్నీ యథావిధిగా కొనసాగాలంటే సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రాయుడు సునీత, డీఆర్‌డీఏ పీడీ శ్రీరమణి, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, పార్టీ రాష్ట్ర నాయకులు దున్నా జనార్దనరావు, కుడుపూడి శివన్నారాయణ, వైస్ ఎంపీపీలు ధూళిపూడి నాగేంద్ర ప్రసాద్, కొపనాతి లలిత, స్థానిక సర్పంచ్ పెయ్యల మంగేష్, ఎంపీటీసీ సభ్యురాలు పోతుల రత్నకుమారి, ఎంపీడీఓ ఎం.అనుపమ, తహసీల్దార్ ఎస్.పోతురాజు, వైఎస్సార్ క్రాంతి పథం డీపీఎం రాయ్, ఏపీఎం రెడ్డి సన్యాసిరావు, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే లక్ష్యంగా మార్ట్‌లు

- కలెక్టర్ కృతికాశుక్లా
- ఎమ్మెల్యేతో కలిసి కోరంగిలో మహిళా మార్ట్ ప్రారంభం



మహిళా మార్ట్‌లో సరకులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యే పొన్నాడ

తాళ్లరేవు: మహిళా సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని, వీటిలో భాగంగాగానే మహిళా మార్ట్‌లను ప్రారంభిస్తున్నామని కాకినాడ జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా అన్నారు. శనివారం కోరంగిలోని బాలయోగి కల్యాణ మండపంలో వైఎస్సార్ క్రాంతి పథం మహిళా సంఘాల ఆధ్వర్యంలో రూ.45 లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన చేయూత మహిళా మార్ట్‌ను ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌తో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం వారిద్దరూ మార్ట్‌ను ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో కలెక్టర్ కృతికాశుక్లా మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధి, సామాన్యుల ప్రయోజనాల రీత్యా మహిళా మార్ట్‌లను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో అత్యధిక మార్ట్‌లను ప్రారంభించిన జిల్లా మనదేనన్నారు. పరిసర గ్రామాల్లో ఎక్కడా లేని విధంగా తక్కువ ధరలకే నాణ్యమైన వస్తువులు విక్రయించేలా మార్ట్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలు, ప్రభుత్వ ఉద్యోగులు ప్రతి ఒక్కరూ ఈ మార్ట్‌లో నిత్యావసర వస్తువులు కొనుగోలు చేసి మార్ట్‌ల ఆర్థికాభివృద్ధికి దోహదపడాలని కోరారు. ఇదే ప్రాంగణంలో ఫుడ్ కోర్టును సైతం ప్రారంభించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రాయుడు సునీత, డీఆర్‌డీఏ పీడీ శ్రీరమణి, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి సామ్యూల్ సాగర్, పార్టీ రాష్ట్ర నేతలు దున్నా జనార్దనరావు, కుడుపూడి శివన్నారాయణ, ఎంపీడీఓ ఎం.అనుపమ, తహసీల్దార్ ఎస్.పోతురాజు, పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాద గోవిందకుమార్, రాయుడు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌కు సత్కారం



ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌ను సత్కరిస్తున్న సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షురాలు అరుణకుమారి తదితరులు

అమలాపురం రూరల్: ఎమ్మెల్సీగా గెలుపొందిన బొమ్మి ఇజ్రాయిల్‌ను అమలాపురం మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షురాలు నక్కా అరుణకుమారి ఆధ్వర్యంలో సర్పంచ్‌లు శనివారం అల్లవరం మండలం గోడిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌కు సర్పంచ్‌లంతా శుభాకాంక్షలు తెలిపి దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు దాసరి అరుణ, పొనకల గణేష్, చెల్లుబోయిన నాని, రేలంగి దుర్గారావు, పందిరి విజయ తదితరులు పాల్గొన్నారు.

అల్లవరం: ఎమ్మెల్సీగా విజయం సాధించిన తరువాత తొలిసారి స్వగ్రామం గోడి విచ్చేసిన బొమ్మి ఇజ్రాయిల్‌ను పంచాయతీరాజ్ శాఖ ఎస్ఈ చంటిబాబు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇజ్రాయిల్‌కు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. ఎస్ఈతో పాటుగా డీఈఈ అన్యం రాంబాబు, రాజ్‌కుమార్, జేఈ సంపత్, పంచాయతీ రాజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆహార భద్రతకు లోబడే తినుబండారాలు తయారుచేయాలి

ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ శ్రీనివాస్ సూచన



సదస్సులో మాట్లాడుతున్న ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ శ్రీనివాస్

అమలాపురం టౌన్: ఆహార భద్రతకు లోబడే తినుబండారాలను తయారు చేయాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ బి.శ్రీనివాస్ సూచించారు. అమలాపురంలోని కోనసీమ కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ హాలులో హోటళ్లు, బేకరీలు, స్వీట్ షాపులు, రెస్టారెంట్ల వ్యాపారులతో అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైజెనిక్ రేటింగ్ కోసం దుకాణదారులు ఫుడ్ సేఫ్టీ కంట్రోలర్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే లైసెన్సులు వ్యాపారులు తమతమ యూనియన్ల ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

ఫుడ్ లైసెన్సులు విధిగా ఉండాలని స్పష్టం చేశారు. నిబంధనలు అతిక్రమించి ఆహార భద్రతకు ఎవరు విఘాతం కలిగించినా వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో అమలాపురం రెస్టారెంట్ల యాజమానుల సంఘం అధ్యక్షుడు నల్లా పవన్‌కుమార్, టిఫిన్స్, హోటళ్ల సంఘం అధ్యక్షుడు బోనం సత్తిబాబు, స్వీటు దుకాణాల యాజమానుల సంఘం అధ్యక్షుడు నల్లా మల్లిబాబు, బేకరీస్ దుకాణాల సంఘం అధ్యక్షుడు మోహన్, ఫుడ్ సేఫ్టీ అధికారులు రాముడు, ప్రసాద్‌లు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా లక్ష్మణరావు



బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన లక్ష్మణరావును అభినందిస్తున్న న్యాయవాదులు

అమలాపురం టౌన్: అమలాపురం బార్ అసోసియేషన్‌కు చెందిన న్యాయవాదులు స్థానిక అసోసియేషన్ భవనంలో శనివారం సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఉండ్రు ఫణీంద్ర లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శిగా డీవీవీఎస్ మూర్తి, ఉపాధ్యక్షుడిగా కుడుపూడి త్రినాథరావు, కార్యదర్శిగా బడుగు భాస్కర్ జోగేష్, లైబ్రేరీ సెక్రటరీగా గుండాబత్తుల రవితేజ, కోశాధికారిగా మోరం చిన్నబ్బాయి, కార్యవర్గ సభ్యులుగా పినిపే రాధాకృష్ణ, యాలంగి సత్యనారాయణ, ఎన్వీ కృష్ణమూర్తి, కొంకి రాజామణి, మెరుగుపువ్వు మోహనరావు, సంసాని శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా కె.సత్యనారాయణ వ్యవహరించారు. నూతన కార్యవర్గ ప్రతినిధులను సీనియర్ న్యాయవాదులు కూచిమంచి మల్లపరాజు, డీబీ లోక్, మట్టా వెంకట్రావు, ఎండీ ఆజామ్ తదితరులు అభినందించారు.

కొబ్బరి ఆధారిత పరిశ్రమల స్థాపనకు ప్రాధాన్యం

జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం రూరల్: స్థానికంగా ఉన్న మెరుగైన అవకాశాల దృష్ట్యా కొబ్బరి విలువ ఆధారిత పరిశ్రమల స్థాపనకు ప్రాధాన్యం కల్పించి జీవనోపాధులు మెరుగుపరచాలని కలెక్టర్ హిమాన్షుశుక్లా అన్నారు. శనివారం స్థానిక జిల్లా కలెక్టర్ చాంబర్‌లో 7వ జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక మండలి సమావేశం శనివారం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ హిమాన్షుశుక్లా మాట్లాడుతూ ఏకగవాక్ష(సింగల్ విండో) విధానంలో అందిన దరఖాస్తులకు కమిటీ సభ్యుల అనుమతితో ఆమోద ముద్ర వేశామన్నారు. కొబ్బరి విలువ ఆధారిత పరిశ్రమల స్థాపనకు వివిధ పథకాల ద్వారా యూనిట్లు మంజూరు చేయాలని మండలి సభ్యులకు సూచించారు. స్థానిక రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని డ్రైనేజీలు, పంట కాలువల్లో పేరుకుపోయిన గుర్రప్పు డెక్క, తూడు తొలగింపునకు వినియోగించే ఎక్స్–200 యంత్రాలు మంజూరు చేయాలని సూచించారు. జగనన్న బడుగు వికాసం ద్వారా 24 క్లెయిమ్స్ రాగా వాటి నిమిత్తం రూ.3.70 కోట్లకు అనుమతులు ఇచ్చామన్నారు. ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం కింద కోనసీమ జిల్లాలో జిల్లా పరిశ్రమల కేంద్రం ద్వారా 117, ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు ద్వారా 47, ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ ద్వారా 25, క్వాయర్ బోర్డు పరిశ్రమల ద్వారా 28 యూనిట్లు గ్రౌండింగ్‌కు నిధులు మంజూరు చేశామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ టి.మురళి, నాబార్డు ఎల్‌డీఎం లక్ష్మీనారాయణ, డీటీవో ఎ.అశోక్ ప్రతాప్‌రావు, డీపీవో ఎస్.మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

ఫైడాలో ఘనంగా వావ్–2కే23 ప్రారంభం

ముఖ్య అతిథిగా హాజరైన టేబుల్ టెన్నిస్ క్రీడాకారుడు ఉమేష్ ఆచంట



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టేబుల్ టెన్నిస్ క్రీడాకారుడు ఉమేష్ ఆచంట

తాళ్లరేవు: పటవల పైడా ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో వావ్–2కే23 స్పోర్ట్స్ ఫెస్ట్‌ను కళాశాల జాయింట్ సెక్రటరీ నిత్యాశ్రీరామ్ శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ క్రీడాకారుడు, ఏడు సార్లు వివిధ ఖండాల్లో అత్యంత ఎత్తైన పర్వతాలను అధిరోహించిన పర్వతారోహకుడు ఉమేష్ ఆచంట హాజరై విద్యార్థులలనుద్దేశించి మాట్లాడారు. తాను నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరేందుకు విద్యార్థి దశలో ఎన్నో అనుభూతులు కోల్పోయానన్నారు. లక్ష్యాన్ని చేరాలంటే కొన్ని త్యాగాలకు సిద్ధపడాలని ఉమేష్ పిలుపునిచ్చారు. మధ్య తరగతి కుటుంబంలో పుట్టినప్పటికీ తన ఆసక్తిని గుర్తించి తన తల్లి ముక్కుపుడక తాకట్టు పెట్టి డబ్బులు సమకూర్చితే, తాను ఈ స్థాయికి చేరుకున్నానని తన బాల్యాన్ని గుర్తుచేసుకున్నారు. ఉమేష్ ఆచంటను దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో డీన్ వీరభద్రరావు, డీడీ రవీంద్ర రెడ్డి, ప్రిన్సిపాల్స్ సూర్యప్రకాష్, కేశవరావు, సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డుకు శంకుస్థాపన



రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ ఊర్మిళాదేవి

ఉప్పలగుప్తం: మండలంలోని భీమనపల్లి పంచాయతీ పరిధి సింగరాయిపాలెం నుంచి విలసవిల్లి మీదుగా కామనగరువు వరకూ నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పినిపే విశ్వరూప్ చొరవతో రోడ్డు నిర్మాణానికి రూ.1.86 కోట్ల ఏఐఐబీ నిధుదలయ్యాయన్నారు. భీమనపల్లి, విలసవిల్లి, అమలాపురం మండలం రెడ్డిపల్లి, కామనగరువు పంచాయతీ పరిధిలకు సంబంధించి 2.6 కిలోమీటర్ల పొడవున బీటీ రోడ్డు వేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భీమనపల్లి సర్పంచ్ పెయ్యల రాజ్‌కుమార్, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మానే శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చెత్త వేస్తే అడ్డుకుంటాం

అంబాజీపేట: నివాస ప్రాంతాల నుంచి తరలించిన చెత్తను, శివారు ప్రాంతంలో వేసినా డంపింగ్ యార్డు నిర్వహించినా అడ్డుకుంటామని, మా ప్రాంతంలో చెత్త వేయవద్దని హడ్కో కాలనీ, నెల్లివారిపేట వాసులు హెచ్చరించారు. అంబాజీపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం ప్రధాన రహదారిపై రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. మా కాలనీ శివారున చెత్త, వ్యర్థాలను వేయడం వల్ల దుర్వాసన వెదజల్లుతుందని, చెత్తకు పొగ పెట్టడంతో కాలనీ అంతా ఆవరించి అనారోగ్యం పాలవుతున్నామన్నారు. మూడు గంటల రాస్తారోకో అనంతరం మా కాలనీలో చెత్త వేయవద్దని తహసీల్దార్‌కు వినతిపత్రం అందించి నిష్క్రమించారు. సీఐ డి.ప్రశాంత్‌కుమార్ ఆధ్వర్యంలో నిలిచిపోయిన ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

ఘనంగా వెంకన్న కల్యాణం



స్వామివారికి కల్యాణం జరిపిస్తున్న పండితులు

ఉప్పలగుప్తం: మండలంలోని చినగాడవిల్లి గ్రామంలో ఉన్న భూసమేత వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. పెద్దింటి వెంకటరామకృష్ణాచార్యులు ఆధ్వర్యంలో నిమ్మకాయల శ్రీనివాస దుర్గారావు, ధనలక్ష్మి దంపతులచే స్వామి వారికి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపారు. ఈ సందర్భంగా తీర్థాన్ని జరిపి, స్వామి వారిని రథంపై ఊరేగిస్తూ గ్రామోత్సవం నిర్వహించారు. చిన్నారులచే ఏర్పాటు చేసిన కోలాట నృత్యాలు అందరినీ అలరించాయి. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అల్లవరం: బెండమూర్లంకలో బంగారు తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణం శుక్రవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ అనువంశిక ధర్మకర్త కంచర్ల వెంకట శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో వందలాది మంది భక్తుల నడుమ ఓడలరేవు గ్రామానికి చెందిన అవనిగడ్డ ఏడుకొండలు, దుర్గాభవాని దంపతుల చేతుల మీదుగా స్వామి వారి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి యాళ్ల దొరబాబు, నవబత్తుల నాగు, సుబ్రహ్మణ్యం, ఎం.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పట్టణ సచివాలయాల కన్వీనర్ల సమావేశం

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణంలోని 15 వార్డు సచివాలయాల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ల సమావేశం స్థానిక సర్ ఆర్థర్ కాటన్ అతిథి గృహంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ సమక్షంలో ఆదివారం ఉదయం 10 గంటలకు జరుగుతుందని పట్టణ పార్టీ అధ్యక్షుడు సంసాని బులినాని శనివారం తెలిపారు. 15 వార్డు సచివాలయాల పార్టీ కన్వీనర్లు ఈ సమావేశానికి విధిగా హాజరు కావాలని బులినాని విజ్ఞప్తి చేశారు.

కోడి పందేల శిబిరంపై దాడి

ముమ్మిడివరం: మండలంలోని కొమానపల్లి శివారు మొల్లివారిపేటలో కోడి పందేల శిబిరం నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో శుక్రవారం రాత్రి పోలీసులు దాడి చేసి ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. వారి నుంచి కోడిపుంజు, కోడి కత్తి, రూ.1700 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితులను కోర్టుకు హాజరుపరిచినట్లు ఎస్ఐ కె.సురేష్‌బాబు శనివారం తెలిపారు.

నాలుగు రీజియన్లూ కలిసుండే రాష్ట్రం కావాలి

యానాం: పుదుచ్చేరిలో ప్రస్తుతమున్న నాలుగు రీజియన్‌లను కలిపి రాష్ట్రహోదా ఇస్తేనే ఒప్పుకుంటామని లేదంటే తాము రాష్ట్ర హోదాకు పూర్తి వ్యతిరేకమని యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌తో పాటు కారైకల్, మాహే శాసనసభ్యులు సైతం స్పష్టం చేశారు. పుదుచ్చేరి అసెంబ్లీలో రాష్ట్రహోదా తీర్మానంపై వారు మాట్లాడుతూ పుదుచ్చేరి ప్రాంతానికి వందల కిలోమీటర్ల దూరంలో భౌగోళికంగా ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న యానాం, కేరళ వద్ద నున్న మాహే, తమిళనాడు వద్ద నున్న కారైకల్ ప్రాంతాలను కలుపుకుని స్పెషల్ కేటగిరీ గల రాష్ట్రాన్ని ఇస్తేనే స్టేటహుడ్‌కు ఒప్పుకుంటామన్నారు.

సుభాష్‌కు జాతీయ స్థాయి అవార్డు



జాతీయ స్థాయి బెస్ట్ యూత్ రెడ్‌క్రాస్ అవార్డు అందుకుంటున్న సుభాష్

అల్లవరం: ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని అంబేడ్కర్ న్యాయ కళాశాలలో చదువుతున్న అల్లవరం మండలం గోడిలంక గ్రామానికి చెందిన శెట్టిబత్తుల సుభాష్ ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి బెస్ట్ యూత్ అవార్డును దక్కించుకున్నారు. హర్యానా రాష్ట్రం కురుక్షేత్రంలో మార్చి 16 నుంచి 21 వరకూ జరిగిన ఇంటర్ స్టేట్ యూత్ రెడ్‌క్రాస్, నేషనల్ రెడ్‌క్రాస్ శిబిరాలకు సుభాష్ ప్రాతినిధ్యం వహించారు. దీంతో జాతీయ స్థాయి అవార్డును నేషనల్ రెడ్‌క్రాస్ జనరల్ డైరెక్టర్ ముకేష్ అగర్వాల్, హర్యానా రాష్ట్ర వైస్ చైర్మన్ సుస్మితాగుప్తా చేతుల మీదుగా శుక్రవారం అందుకున్నారు. 17 రాష్ట్రాల్లోని 44 యూనివర్సిటీల నుంచి 187 మంది విద్యార్థులు, రెడ్‌క్రాస్ సభ్యులు పాల్గొనగా జాతీయ స్థాయిలో సుభాష్‌కు మొదటి స్థానం దక్కిందని అతని తండ్రి తులసీరామ్ శనివారం తెలిపారు. అతన్ని పలువురు అభినందించారు.

ఏకాదశి పర్వదినాన ఆలయానికి పోటెత్తిన భక్తులు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో శనివారం ఏకాదశి పర్వదినాన స్వామివారి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. ఏకాదశి పురస్కరించుకుని ఆలయంలోని నారసింహ సుదర్శన హోమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ కుటుంబ సమేతంగా సుదర్శన హోమంలో పాల్గొని స్వామిని కొలిచారు. ఇదిలా ఉండగా ఆలయానికి సుమారు 5 వేల మంది భక్తులు వచ్చినట్టు దేవస్థానం వర్గాలు తెలిపారు.